నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్ - నిర్మల్
5 | నిజామాబాద్ శనివారం 22 ఫిబ్రవరి 2025 | ADILABAD NIRMAL

విద్యార్థులకు ఉపాధి మార్గాలను చూపించడమే లక్ష్యం

సమావేశంలో మాట్లాడుతున్న ఓఎస్‌డీ మురళీదర్శన్

బాసర, ఫిబ్రవరి 21 : ట్రిపుల్‌ఐటీ విద్యార్థులకు ఉపాధిమార్గాలను చూపించడమే లక్ష్యంగా విద్యార్థులకు ప్రత్యేక అవగాహన తరగతులు నిర్వహిస్తున్నామని ట్రిపుల్ ఐటీ వీసీ గోవర్ధన్ అన్నారు. శుక్రవారం ట్రిపుల్‌ఐటీలో 'భారతదేశంలో వ్యవస్థాపకత అభివృద్ధి, ఉపాధి అవకాశాలు' అనే అంశంపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఉపాధిమార్గాలను అన్వేషించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని రూపొందించడం అభినందనీయమన్నారు. ప్రస్తుతం దేశంలో ఉన్న వ్యవస్థాపక విధానంపై ఓఎస్‌డీ మురళీదర్శన్ వివరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ డీన్ డా. విఠల్, హెచ్‌వోడీ డా. నాగసాయి, స్వప్నిల్, స్వాతి, శ్రీవిద్య, విద్యార్థులు పాల్గొన్నారు.

కంది పంటను ప్రభుత్వమే కొనాలి

కలెక్టర్‌కు రైతుల విన్నపం

కంది పంట దిగుబడి వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ రాజర్షిషా

తాంసి, ఫిబ్రవరి 21 : కంది పంట కొనుగోళ్లలో పరిమితి విధించవద్దని, పంట మొత్తం ప్రభుత్వమే కొనాలని ఆదిలాబాద్ కలెక్టర్‌కు రైతులు విన్నవించారు. తాంసి మండలంలోని హస్నాపూర్‌లో కంది పంటను శుక్రవారం కలెక్టర్ రాజర్షి షా పరిశీలించారు. ఈ సందర్భంగా రైతు వేదికలో రైతులతో సమావేశం ఏర్పాటు చేసి పంట దిగుబడుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎకరానికి ఆరు నుంచి ఏడు క్వింటాళ్లు పండుతాయని రైతులు తెలిపారు. పండిన పంటను ప్రభుత్వమే కొనేలా చూడాలని కలెక్టర్‌కు రైతులు విన్నవించారు. రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రవీందర్, వ్యవసాయ విస్తరణ అధికారి అమిరొద్దీన్, నాయకులు రాంచందర్ రెడ్డి, నర్సింగ్ రైతులు పాల్గొన్నారు.

కాసులు కడితేనే ఎల్ఆర్ఎస్



ఎన్నికల ముందు ఉచితమని.. ఇప్పుడు మాట మార్చిన కాంగ్రెస్ సర్కారు

- గతేడాది మొత్తం కట్టాల్సిందేనని.. ఇప్పుడేమో 25 శాతం రాయితీ అంటూ బుకాయింపు
- ఉమ్మడి జిల్లాల్లోని 11 మున్సిపాలిటీల్లో 66,095 పెండింగ్ దరఖాస్తులు
- ఆ అప్లికేషన్లపై ఇప్పటికీ కొనసాగుతున్న క్షేత్రస్థాయి పరిశీలన
- సామాన్యులపై పెనుభారం.. ఆశలు గల్లంతు

మంచిర్యాల, ఫిబ్రవరి 21 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : 'అధికారంలోకి వస్తే ఎల్ఆర్ఎస్(లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీం)ను రద్దు చేస్తాం. పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలు కొనుగోలు చేసిన లే-అవుట్‌లలోని ప్లాట్లను ఉచితంగా క్రమబద్ధీకరిస్తాం.' అన్న హామీని కాంగ్రెస్ సర్కారు పూర్తిగా విస్మరించింది. కాంగ్రెస్ గెలిస్తే పైసా కట్టకుండా ప్లాట్లు, లే-అవుట్లు క్రమబద్ధీకరించుకోవచ్చని ఆశలు పెట్టుకున్న సామాన్యులపై గుదిబండ వేసింది. ప్రజలకు ఇచ్చిన మాటను పక్కన పెట్టి కాసులు వేటలో తలమునకలైంది. గతేడాది గెలిచీ గెలవగానే.. ఎల్ఆర్ఎస్ ఉచితంగా చేయడం కుదరదు.. 2020లో దరఖాస్తు చేసుకున్న వారు పూర్తి రుసుము చెల్లించి లే-అవుట్‌లను క్రమబద్ధీకరించుకోవాలంటూ బాంబు పేల్చిన సర్కారు, సిబ్బంది కొరత, క్షేత్రస్థాయి ఇబ్బందుల నేపథ్యంలో దాన్ని వాయిదా వేసింది. కొన్ని నెలలుగా ఎల్ఆర్ఎస్ పెండింగ్ దరఖాస్తులపై అధికారులను పురమాయించింది. క్షేత్రస్థాయిలో పరిశీలన కొనసాగుతున్న నేపథ్యంలో ఎల్ఆర్ఎస్ ఉచితం అన్న హామీ గురించి ఎలాంటి ప్రస్తావన లేకుండా.. మార్చి 31లోగా చార్జీలు చెల్లించే వారికి 25 శాతం రాయితీ అంటూ ప్రకటించింది. దీనిపై దరఖాస్తు దారులు మండిపడుతున్నారు. ఎల్ఆర్ఎస్ లేకుండా రద్దు చేస్తామని చెప్పి ఇప్పుడేదో ఉద్ధరించినట్లు 25శాతం రాయితీ పేరుతో సర్కారు డ్రామాలు ఆడుతుందంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఐదేళ్లుగా ఎల్ఆర్ఎస్ కోసం ఎదురుచూస్తున్న వారి అవసరాన్ని ఆసరాగా చేసుకొని, డబ్బులు వసూలు చేసేందుకు సిద్ధమైందని పలువురు విమర్శిస్తున్నారు.

2020 ఆగస్టులోపు చేసుకున్నవారికేనా.. స్పష్టత కరువై గందరగోళం..

2020, ఆగస్టు నుంచి అక్టోబర్ 31 దాకా అప్పటి కేసీఆర్ ప్రభుత్వం రెండు నెలల పాటు ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు స్వీకరించింది. వచ్చిన దరఖాస్తుల్లో కొన్నింటిని పరిష్కరించింది. క్షేత్రస్థాయిలో ఎదురైన ఇబ్బందులు, చార్జీలపై రియల్ ఎస్టేట్ సంఘాల నుంచి అభ్యంతరాలు రావడంపై, కోర్టు కేసుల నేపథ్యంలో ప్రక్రియ నిలిచిపోయింది. అప్పుడు వచ్చిన దరఖాస్తులనే పరిష్కరించి, సొమ్ము చేసుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్ఆర్ఎస్‌కు సిద్ధమైంది. 2020, ఆగస్టు 26కు ముందు ఏర్పాటు చేసిన లే-అవుట్‌లలోని ప్లాట్‌లను క్రమబద్ధీకరిస్తారని తెలుస్తున్నది. దరఖాస్తు చేసుకున్నా, చేసుకోకపోయినా నిర్దేశించిన గడువులోపు లే-అవుట్‌లో 10 శాతం ప్లాట్‌లను రిజిస్టర్ సేల్‌డీడ్ ద్వారా విక్రయిస్తే.. మిగిలిన 90 శాతం ప్లాట్‌ల క్రమబద్ధీకరణకు ఛాన్స్ ఇస్తారని చెబుతున్నారు. ఇలా ఉన్నవారంతా మార్చి 31లోగా క్రమబద్ధీకరణ, ప్రోరేటా ఓపెన్ స్పేస్ చార్జీలు చెల్లిస్తే 25శాతం రాయితీ ఇస్తారని తెలుస్తున్నది. ఈ మేరకు జీవో విడుదల చేసినట్లు చెబుతున్నా.. ఆ విషయంలో ఇప్పటి వరకు క్లారిటీ రాకపోవడం కాస్త గందరగోళంగా మారింది. ఎల్ఆర్ఎస్ కోసం వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించాల్సి ఉంటుంది. ఎల్1, ఎల్2, ఎల్3 అని మూడు విభాగాలు ఉంటాయి. ఇందులో ఎల్1 అంటే టీపీబీవోలు క్షేత్రస్థాయికి వెళ్లి స్థలాన్ని చూశాకే నిర్ణయం తీసుకుంటారు. గ్రీన్‌జోన్, చెరువులు, కుంటలు, ప్రభుత్వ స్థలాలు, వక్ఫ్ భూములు ఉన్న స్థలాల్లో ప్లాట్లు ఏర్పాటు చేశారా.. లేకపోతే అన్ని సరిగ్గానే ఉన్నాయా అని పరిశీలించి రిపోర్ట్ ఇస్తారు. అదయ్యాక రెండో దశలో ఎల్2లో టీపీవో, టీపీఎస్ సరిచూసుకొని ఓకే చేస్తే, మూడో దశ ఎల్3లో మున్సిపల్ కమిషనర్ వాటికి ఆమోద ముద్ర వేస్తారు. ఈ పెండింగ్ దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ కొనసాగుతుందని, దాదాపు 90శాతం పని పూర్తయ్యిందని అధికారులు చెబుతున్నారు.

సామాన్యులపై గుదిబండ..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని 11 మున్సిపాలిటీల పరిధిలో 2020లో ఎల్ఆర్ఎస్ క్రమబద్ధీకరణకు వచ్చిన దరఖాస్తులు 88,283 ఉండగా, వీటిలో 22వేల పైచిలుకు దరఖాస్తులను అప్పుడే పరిష్కరించారు. దాదాపు మరో 66వేల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. అత్యధికంగా మంచిర్యాల మున్సిపాలిటీలో 18,933, ఆదిలాబాద్‌లో 14,208, నిర్మల్‌లో 11,429, భైంసాలో 8,950, క్యాతన్‌పల్లిలో 5,797 ఎల్ఆర్ఎస్ పెండింగ్ అప్లికేషన్లు ఉన్నాయి. వీటన్నింటినీ ఇప్పుడు క్రమబద్ధీకరించనున్నప్పటికీ... ఎల్ఆర్ఎస్ చార్జీలు కట్టాల్సి రావడం సామాన్యులకు పెనుభారంగా మారనున్నది. పట్టణ ప్రాంతాల్లో ఎల్ఆర్ఎస్ చేయించుకునేందుకు ఒక్క ప్లాట్‌లపై తక్కువలో తక్కువ రూ.50వేల నుంచి రూ.లక్ష వరకు అవుతుంది. ఈ మొత్తం కట్టి ఎల్ఆర్ఎస్ చేయించుకున్నాక, ఆ క్లియరెన్స్ సర్టిఫికెట్‌తో రిజిస్ట్రేషన్ సైతం చేయించుకోవాల్సి ఉంటుంది. ఇక్కడ మరోసారి రిజిస్ట్రేషన్ చార్జీలు చెల్లించాల్సి ఉంటుంది. ఈ లెక్కన ఒక్కో దరఖాస్తుదారుకు సుమారు రూ.1.50 లక్షల నుంచి రూ.2లక్షల వరకు భారం పడుతుంది. ఈ మొత్తం చెల్లించడం సామాన్యులకు తలకుమించిన భారమని పలువురు అంటున్నారు. కాంగ్రెస్ ఇచ్చిన మాటకు కట్టుబడి ఎల్ఆర్ఎస్‌ను రద్దు చేయాలని, ఉచితంగా ప్లాట్‌లను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలోని 11 మున్సిపాలిటీల్లో 2020లో వచ్చిన ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల వివరాలు ఇలా..

మున్సిపాలిటీ	వచ్చిన దరఖాస్తులు	పరిష్కరించినవి	పెండింగ్‌లో ఉన్నవి
ఆదిలాబాద్	19,430	5,222	14,208
నిర్మల్	15,413	3,984	11,429
ఖానాపూర్	1,910	1,184	726
భైంసా	10,800	1950	8,850
కాగజ్‌నగర్	1,845	150	1,695
మంచిర్యాల	22,954	4,021	18,933
లక్షెట్టిపేట	2,163	311	1,852
చెన్నూర్	1,321	28	1,293
నస్పూర్	4,921	4,024	897
క్యాతన్‌పల్లి	7,111	1,314	5,797
బెల్లంపల్లి	415	0	415
మొత్తం	88,283	22,188	66,095

సామాన్యులపై భారం

గెలిస్తే ఎల్ఆర్ఎస్‌ను రద్దు చేస్తామన్న హామీని కాంగ్రెస్ సర్కారు నిలబెట్టుకోవాలి. ప్రజల అవసరాన్ని ఆసరా చేసుకొని ఓట్లు కొల్లగొట్టడం కోసమే సాధ్యం కాని హామీలు ఇచ్చింది. ఎల్ఆర్ఎస్ విషయంలో మాట మార్చడం కాంగ్రెస్ మోసపూరిత విధానాలకు నిదర్శనం. ఎల్ఆర్ఎస్‌కు డబ్బులు కట్టాల్సి వస్తే సామాన్యులపై పెనుభారం పడుతుంది. ఇచ్చిన హామీకి కట్టుబడి ఉచితంగా ఎల్ఆర్ఎస్ చేయాలి.

- పెంట రాజయ్య, మంచిర్యాల మాజీ మున్సిపల్ చైర్మన్

ఎల్ఆర్ఎస్ రద్దు చేయాలి

కాంగ్రెస్ ఇచ్చిన మాటకు కట్టుబడి ఎల్ఆర్ఎస్‌ను పూర్తిగా రద్దు చేయాలి. పేద, మధ్యతరగతి ప్రజలకు మేలు చేసేలా ఉచితంగా ప్లాట్‌లను క్రమబద్ధీకరించాలి. ఈ విషయంలో మాట మార్చిన కాంగ్రెస్ పార్టీ పై ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఎల్ఆర్ఎస్ కోసం ఏండ్లుగా ఎదురుచూస్తూ, ఉచితంగా అవుతుందని పెట్టుకున్న ఆశలను ఈ సర్కారు అడియాశలు చేసింది. ఇచ్చిన మాటకు కట్టుబడి సామాన్యులను న్యాయం చేయాలని కోరుతున్నాం.

- గాదె సత్యం, బీఆర్ఎస్ మంచిర్యాల పట్టణ అధ్యక్షుడు

ఆదిలాబాద్ మార్కెట్‌యార్డుకు పత్తి లోడ్‌లతో వచ్చిన వాహనాలు

ఆగని దళారుల దందా

- పది రోజుల తర్వాత కొనుగోళ్లు ప్రారంభించిన సీసీఐ
- రైతుల పేరిట విక్రయాలు
- కరువైన పర్యవేక్షణ

ఆదిలాబాద్, ఫిబ్రవరి 21 (నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ మార్కెట్‌యార్డులో పత్తి విక్రయాల్లో దళారుల దందా కొనసాగుతూనే ఉంది. కొన్ని రోజులుగా దళారులు మాయాజాలం ప్రదర్శిస్తూ అమాయక రైతుల పేరిట వందల క్వింటాళ్ల పత్తిని సీసీఐకి విక్రయిస్తూ భారీగా సొమ్ము చేసుకుంటున్నారు. గ్రామాలు, మండల కేంద్రాల్లో రైతుల వద్ద నుంచి పంటను తక్కువ ధరకు కొని మద్దతు ధరతో సీసీఐకి విక్రయిస్తున్నారు. జిల్లాలోని నార్నూర్, ఇంద్రవెల్లి, ఇచ్చోడతో పాటు కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్, జైనూర్, మహారాష్ట్రలోని వివిధ ప్రాంతాలకు చెందిన దళారులు అక్రమ దందాకు పాల్పడుతున్నారు. రైతుల వద్ద నుంచి తక్కువ ధరకు క్వింటాలుకు రూ.6500 వరకు కొనుగోలు చేసి సీసీఐకి క్వింటాలుకు రూ.7421 చొప్పున విక్రయిస్తున్నారు. దళారులు భారీ వాహనాల్లో వంద క్వింటాళ్ల వరకు పత్తిని తీసుకువస్తుండడంతో అధికారులు కొనుగోలు చేయడం లేదు. వ్యాన్‌లు, ట్రాక్టర్‌లో పత్తిని తీసుకువస్తేనే కొనుగోలు చేస్తున్నారు. దీంతో దళారులు ఐచర్ వాహనాల్లో కాకుండా మినీ వాహనాల్లో పంటను తీసుకువస్తున్నారు. మార్కెట్‌యార్డుల్లో పంట విక్రయాల్లో తేమ, పత్తి నాణ్యత విషయంలో ధర తగ్గిస్తున్న సీసీఐ అధికారులు దళారులు విక్రయించే పంట విషయంలో చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారని రైతులు అంటున్నారు.

పది రోజుల తర్వాత కొనుగోళ్లు ప్రారంభం

జిల్లాలో పది రోజుల నుంచి సర్వర్ సమస్య కారణంగా కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) పత్తి కొనుగోళ్లు నిలిచిపోయాయి. దీంతో రైతులు తక్కువ ధరకు పంటను ప్రైవేట్ వ్యాపారులకు క్వింటాలుకు రూ.6920కి విక్రయించి నష్టపోయారు. పది రోజుల తర్వాత శుక్రవారం ఆదిలాబాద్ మార్కెట్‌యార్డులో పత్తి కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. జిల్లాలో మిగతా మార్కెట్ యార్డుల్లో ఎక్కడా పత్తి కొనుగోళ్లు లేకపోవడంతో ఆయా ప్రాంతాల నుంచి సైతం ఇక్కడికే తీసుకువస్తున్నారు. దళారులు వాహనాల్లో ఎక్కువ మొత్తంలో పంటను మార్కెట్‌యార్డుకు తీసుకువస్తుండడంతో రైతులు పంట విక్రయానికి ఇబ్బంది పడుతున్నారు. ఆదిలాబాద్ మార్కెట్‌యార్డులో పత్తి విక్రయాల్లో అక్రమాలు జరిగాయంటూ మార్కెట్‌యార్డు కార్యదర్శి మధుకర్‌ను ఇటీవల సస్పెండ్ చేశారు. దళారులు తీసుకువచ్చిన పత్తికి సీసీఐకి విక్రయించేందుకు వీలుగా టెంపరరీ రిజిస్ట్రేషన్ పత్రాలు జారీ చేశారనే ఆరోపణలు రావడంతో అధికారులు చర్యలు తీసుకున్నారు. పత్తి కొనుగోళ్లలో దళారుల దందాకు అడ్డుకట్ట వేయాలని రైతు సంఘాల నాయకులు కోరుతున్నారు.

రైతులు రాకపోవడంతో పక్కకు నిలిపిన వాహనాలు

దళారుల అక్రమ దందాను అరికట్టాలి

జిల్లాలో సీసీఐ పత్తి విక్రయాల్లో దళారుల దందాను నివారించేందుకు అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకోవాలి. రైతుల వద్ద నుంచి తక్కువ ధరకు పంటను కొనుగోలు చేస్తున్న దళారులు, మద్దతు ధరకు సీసీఐకి పంటను విక్రయిస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారు. అమాయక రైతులను డబ్బులు ఆశగా చూపి వారి పట్టా పాసు పుస్తకాలు, ఆధార్‌కార్డులు తీసుకుని పంటను వారి పేరిట పంటను విక్రయిస్తున్నారు. పంట కొనుగోళ్లలో రైతుల వివరాలను పూర్తిగా పరిశీలించాలి.

- భోజన్న, రైతు, స్వరాజ్య వేదిక, జిల్లా అధ్యక్షుడు

అగ్ని ప్రమాద బాధితులను ఆదుకుంటాం

నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్

బాధిత కుటుంబాలతో మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

పెంబి, ఫిబ్రవరి 21: అగ్ని ప్రమాదంలో నష్టపోయిన బాధితులను ఆదుకుంటామని నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. నిర్మల్ జిల్లా పెంబి మండలంలోని రాయదారి గ్రామంలో గురువారం షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైన ఇండ్లను అధికారులతో కలిసి పరిశీలించి, బాధితులను పరామర్శించారు. ఘటనకు సంబంధించిన వివరాలను బాధితులు, అధికారులను అడిగి తెలుసుకున్నారు.అనంతరం ఆమె మాట్లాడుతూ అగ్నిప్రమాద ఘటన బాధాకరమన్నారు. ప్రభుత్వ పరంగా అన్ని విధాలుగా ఆదుకుంటామని బాధితులకు హామీ ఇచ్చారు. తక్షణ సహాయం కింద ప్రతి కుటుంబానికీ 25 కిలోల బియ్యంతో పాటు నిత్యావసర సరుకులు, బట్టలు అందజేశారు. ఒక్కో కుటుంబానికీ రూ. 98900 చొప్పున పరిహారం రెండు రోజుల్లో అందించనున్నట్లు తెలిపారు. ఇల్లు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు. బాధితులు కోలుకునే వరకు భోజనం, వసతి కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్, మండల ప్రత్యేక అధికారి నరసింహారెడ్డి, తహసీల్దార్ లక్ష్మణ్, ఎంపీడీవో రమాకాంత్ తదితరులు పాల్గొన్నారు.

లేగదూడపై చిరుత దాడి

- భైంసా, తానూర్ మండలాల రైతులు అప్రమత్తంగా ఉండాలి
- అటవీ అధికారుల హెచ్చరిక

చిరుతపులి పాదముద్రలను పరిశీలిస్తున్న అధికారులు

భైంసాటౌన్, ఫిబ్రవరి 21: తానూర్ మండలంలో బెంబర గ్రామంలో గురువారం రాత్రి లేగ దూడపై చిరుతపులి దాడి చేసి హతమార్చింది. దీంతో సమీప గ్రామాల ప్రజలు, రైతులు భయాందోళనకు గురవుతున్నారు. తానూర్ మండలంలోని బెంబెరలోని సాయిలుకు చెందిన 15 రోజుల వయస్సు గల లేగదూడపై గురువారం రాత్రి చిరుతపులి దాడి చేసి సమీప పొదల్లోకి లాక్కెళ్లి చంపి తినేసింది. అలాగే భైంసా మండలంలోని సిరాల గ్రామానికి చెందిన మోహన్‌రావ్ పటేల్ మక్కచేనుకు నీళ్లు పెడుతుండగా చిరుతపులి రావడంతో కేకలు వేశాడు. చేను వద్ద కట్టేసిన కుక్కపై దాడి చేసి చంపేసింది. సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు శుక్రవారం ఉదయం చిరుతపులి సంచరించిన ప్రాంతాలకు చేరుకుని పాదముద్రలను పరిశీలించి చిరుతపులి పిల్లగా గుర్తించారు. దాడి జరిగిన ప్రదేశంలో సీసీ కెమెరాలను అమర్చారు. మూడు సంవత్సరాలుగా చిరుతదాడిలో తమ పశువులు చనిపోతున్నాయని, అధికారులు చిరుతపులి బెడదను నివారించాలని రైతులు కోరారు. ఈ సందర్భంగా ఎఫ్ఆర్వో శంకర్ మాట్లాడుతూ.. పొలాల్లో చిరుతపులి పాదముద్రలు కనిపించాయని, అటవీ ప్రాంతంలోకి ఎవరూ వెళ్లొద్దని సూచించారు. రాత్రి సమయాల్లో ఒంటరిగా వెళ్లవద్దని రైతులను హెచ్చరించారు. చిరుతపులి కనిపిస్తే అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని, దానికి ఎలాంటి హాని తలపెట్టవద్దని కోరారు.

టీజీసెట్‌కు ఏర్పాట్లు పూర్తి

ఆదిలాబాద్ డీసీవో ఎం.లలిత కుమారి

మాట్లాడుతున్న డీసీవో లలిత కుమారి

ఎదులాపురం, ఫిబ్రవరి21: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, బీసీ, ఎస్టీ గురుకులాల్లో ఐదవ తరగతిలో, ఖాళీగా ఉన్న సీట్లు భర్తీ కోసం ఈ నెల 23న నిర్వహించే ప్రవేశ పరీక్ష(టీజీసెట్)కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆదిలాబాద్ జిల్లా కోఆర్డినేటర్ ఎం. లలిత కుమారి తెలిపారు. శుక్రవారం ఆదిలాబాద్‌లో ఎస్సీ గురుకులంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. 2025-2026 విద్యా సంవత్సరానికిగాను ఐదవ తరగతిలో ప్రవేశానికి, 6, 7, 8, 9వ తరగతిలో బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీ కోసం ప్రవేశ పరీక్షను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో 4193 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 10 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్ష ఉదయం 11 గంటల నుంచి ఒంటి గంట వరకు ఉంటుందన్నారు. పరీక్ష రాసే విద్యార్థులు కచ్చితంగా హాల్‌టికెట్‌తో పాటు ఆధార్‌కార్డు, పరీక్ష ప్యాడ్, బ్లూ, బ్లాక్ పెన్నులు వెంట తెచ్చుకోవాలని తెలిపారు. ఆధార్‌కార్డులో పేర్లు తప్పుగా ఉన్నట్లయితే బోనాఫైడ్ జిరాక్స్ తీసుకొని రావాలని సూచించారు. పరీక్షా కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేశామని, కేంద్రానికి ఒక అధికారిని నియమించినట్లు తెలిపారు.

ఎమ్మెల్సీ ఎన్నికలను సజావుగా నిర్వహించాలి

నిర్మల్ చైన్‌గేట్/ఎదులాపురం ఫిబ్రవరి, 21: ఈ నెల 27 న రాష్ట్ర శాసనమండలి ఎన్నికలు సజావుగా నిర్వహించాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్సీ ఎన్నికలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో శుక్రవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పోలింగ్ నిర్వహణ, ఓటరు స్లిప్పుల పంపిణీ, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల ఏర్పాటు, కరీంనగర్‌లోని రిసెప్షన్ సెంటర్‌కు బ్యాలెట్ బాక్సుల తరలింపు, పోస్టల్ బ్యాలెట్, వెబ్ క్యాస్టింగ్ ఏర్పాట్లు, పోలింగ్ కేంద్రాల్లో వసతులు, పోలీసు బందోబస్తు, ఓటరు ఫెసిలిటేషన్ సెంటర్లు, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు, నిఘా బృందాల పనితీరు పర్యవేక్షణ తదితర అంశాలపై సూచనలు చేశారు. నిర్మల్ కలెక్టరేట్ నుంచి కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ జానకీషర్మిల, అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్ ఆర్డీవోలు రత్నకల్యాణి, కోమల్‌రెడ్డి, జడ్పీ సీఈవో గోవింద్, డీపీవో శ్రీనివాస్ పాల్గొన్నారు. ఆదిలాబాద్ కలెక్టరేట్ నుంచి కలెక్టర్ రాజర్షి షా, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, సబ్ కలెక్టర్ యువరాజ్, ట్రెయినీకలెక్టర్ అభిగ్యాన్, డీఎస్పీ జీవన్ రెడ్డి, ఆర్డీవో వినోద్ కుమార్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.